ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

-  రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అదానీ గ్రూప్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు.
-  దేశవ్యాప్తంగా 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రెండు సంవత్సరాల క్రితం రోజ్ గార్ మేళా ప్రారంభించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.
-  అఖండ గోదావరి పుష్కరాలు-2027 కు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఈరోజు రాజమహేంద్రవరంలో సమీక్షా సమావేశం నిర్వహించింది.
-  పొదుపు సంఘాల మహిళలు వ్యాపారాలు చేస్తే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.
-  రాష్ట్రంలో బెల్టు షాపులు నడిపినా, కల్తీ మద్యం విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

===================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అదానీ గ్రూప్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ చర్చల అనంతరం రాష్ట్రంలోని ఓడరేవులు, మైనింగ్, అమరావతి రింగ్ రోడ్డు, ఐటీ, టూరిజం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు అదానీ గ్రూప్ సంస్థ ఆసక్తి కనబరిచిందని చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదానీ ఎక్స్పోర్ట్స్ లిమిటెడ్ ఎండీ రాజేశ్ అదానీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

===================

దేశవ్యాప్తంగా 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రెండు సంవత్సరాల క్రితం రోజ్ గార్ మేళా ప్రారంభించారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈరోజు విశాఖపట్నంలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన రోజ్ గార్ మేళాలో స్థానిక పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఎంపికైన 110 మందికి నియామక పత్రాలను మంత్రి అందజేశారు. మరిన్ని వివరాలను మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి ఎస్ ఎన్ మూర్తి అందిస్తారు. ....వాయిస్ బైట్....

(వాయిస్ 37 సెకన్లు)

===================

అఖండ గోదావరి పుష్కరాలు-2027 కు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఈరోజు రాజమహేంద్రవరంలో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమీక్షలో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్థానిక పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, మునిసిపల్ కమీషనర్ కేతాన్ గార్గ్, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అఖండ గోదావరి గోదావరి పుష్కరాలు 2027 ను దృష్టిలో పెట్టుకొని జిల్లాను యూనిట్ గా పరిగణనలోకి తీసుకొని సమర్ధవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. రానున్న అఖండ గోదావరి పుష్కరాలకు సుమారు 8కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని భవిష్యత్తు అంశాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర కార్యాచరణపై అధికారులతో చర్చించడం జరిగిందని మంత్రి పేర్కొంటూ...

మంత్రి కందుల దుర్గేష్ వాయిస్ (20 సెకన్లు)

అలాగే ...దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ...

దగ్గుబాటి పురందేశ్వరి.. వాయిస్ (20 సెకన్లు)

===================

పొదుపు సంఘాల మహిళలు వ్యాపారాలు చేస్తే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి-ప్రైజ్ అవార్డుల కార్యక్రమానికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీఎం స్వనిధి పథకం సమర్థంగా అమలు చేసిన మున్సిపాలిటీలు, బ్యాంకులకు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను ఈ సందర్భంగా ప్రధానం చేసారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావడానికి పీఎం స్వనిధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పీఎం స్వనిధి పథకం కింద 5లక్షల 48వేల 957 దరఖాస్తులు వస్తే 5 లక్షల 2వేల 894 మంది పేదలకు రుణాలిచ్చామన్నారు. పీఎం స్వనిధి అమలులో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, బ్యాంకర్లకు అభినందనలు తెలిపారు.

===================

విరామం

===================

రాష్ట్రంలో బెల్టు షాపులు నడిపినా, కల్తీ మద్యం విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడం జరిగిందన్నారు. గతంలో మద్యం నాణ్యతను కనీసం పరీక్షించే వ్యవస్థ లేదని కానీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక 9 దశల్లో పరీక్షించిన తరువాత నాణ్యమైన మద్యాన్ని అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

===================

ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైయస్సార్ జిల్లాల్లకు సాగునీటితో పాటు తాగునీటిని అందించే వెలిగొండ ప్రాజెక్టును రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ లు ఈరోజు సందర్శించారు. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రకాశం జిల్లా ప్రతినిధి ఎం.వి.ఎస్.ప్రసాద్ అందిస్తారు.... (వాయిస్ 30 సెకన్లు)

===================

నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని రూపొందించిందని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నవభారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులైన 48,578 మంది స్వయంశక్తి మహిళలను అక్షరాస్యులుగా మార్చి, జిల్లాను వచ్చే ఆరు నెలల్లో సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడిపించాలన్నారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంపై వయోజన విద్యాశాఖ రూపొందించిన గోడ పత్రికలను, శిక్షణకు ఉద్దేశించిన పుస్తకాలను కలెక్టర్ ఈరోజు ఆయన ఛాంబర్ లో ఆవిష్కరించారు.

===================

ప్రభుత్వరంగ సంస్థలు, వివిధ విభాగాలు, మీడియా యూనిట్ల మధ్య పరస్పర సమన్వయం సహకారాన్ని పెంపొందించడానికి, ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (#IMPCC) సమావేశాన్ని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి అధ్యక్షతన ఈరోజు విశాఖపట్నంలో నిర్వహించారు.

===================

పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో నైపుణ్య గణన గణాంకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈరోజు భీమవరంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన-2024 జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే యువత ఎక్కువగా ఉన్న దేశం భారతదేశమని వీరందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోతే సమస్యగా మారే అవకాశం ఉందన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా దేశం యొక్క తలసరి ఆదాయం పెరగడంతో పాటు, దేశం ఆర్థికంగా బలోపేతం అవుతుందని అన్నారు. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఎంతోమంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, మన దేశంలోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉద్యోగ అన్వేషణకు ఉపయోగ పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

===================

మెప్మా ఆధ్వర్యంలో ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అర్బర్ మార్ట్ ను ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని మెప్మా సంచాలకులు రవికుమార్ అన్నారు. పండుగ వేళ పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన అన్ని రకాల ఉత్పత్తులను రెండు రోజుల పాటు ఈ మార్ట్ లో ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందని మహిళా సంఘాలు తయారు చేసిన 160 ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా అమ్మకాలకు అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

===================

===================